సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



డేంజర్‌లో మైనర్

రోడ్లపై బైక్‌లతో మైనర్లు దూసుకెళ్తున్నారు. ఏమాత్రం రహదారి నిబంధనలు తెలియని వీరు.. ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. -8లో..



ఎరువు దుకాణాల తనిఖీ

జిల్లాలో గురువారం గోపవరం, అట్లూరు మండలాల్లోని ఎరువుల దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.9 /24.9

జిల్లాలో గురువారం 24.9 – 34.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గురువారం తెల్లవారు జామున జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. సిద్దవటంలో అత్యధికంగా 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.కడపలో 8.4, తొండూరులో 5.4, ఎర్రగుంట్లలో 5.2, చెన్నూరులో 4.8, సీకేదిన్నె, కమలాపురంలలో 3.2, ఖాజీపేటలో 2.6, పెద్దముడియంలో 1.4 , వల్లూరులో 1.2, పొద్దుటూరులో 0.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

24న బ్యాడ్మింటన్ ఎంపికలు

ప్రొద్దుటూరు కల్చరల్: ఖాజీపేటలోని బీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషన్ స్కూల్, జూనియర్ కాలేజీలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా సబ్ జూనియర్, జూనియర్ బాల్ బాడ్మింటన్ జట్ల ఎంపికలు ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆకేపాటి శంకర్‌రెడ్డి, కార్యదర్శి సుధాకర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రాలతో 24న ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన వారు ఈనెల 30 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు మహానందిలో జరిగే అంతర్‌జిల్లా ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారని వివరించారు. మరిన్ని వివరాలకు 7386202520 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నాగిరెడ్డి



కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లా న్యాయ విభాగ అధ్యక్షుడిగా నాగిరెడ్డిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది.

పీజీ, న్యాయ పరీక్షలు ప్రారంభం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు, మూడేళ్ల, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. వైవీయూ పీజీ క్యాంపస్‌లో నిర్వహించిన పరీక్షలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డిలు తనిఖీ చేశారు. పరీక్షల వికేంద్రీకరణ వల్ల చదువుతున్న తరగతి గదుల్లో, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలకు హాజరుకావడం విశేషం.

గండికోటలో లోకేషన్ల వేట



పెన్నానది లోయ వద్ద దర్శకుడు సంతోష్ తదితరులు

జమ్మలమడుగు రూరల్: పర్యాటక ప్రాంతమైన గండికోట ప్రాంతంలో తెలుగు సినిమా చిత్రీకరణ కోసం లోకేషన్లను తెలుగు దర్శకులు పరిశీలించారు. గురువారం యువ దర్శకుడు సంతోష్ జాగర్లపూడి, మరి కొంత మంది చిత్ర యూనిట్ సభ్యులు గండికోటలో కలియ తిరిగారు. గతంలో సుమంత్ హీరోగా సుబ్రమణ్యపురం, నాగశౌర్య హీరోగా లక్ష్య వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన సంతోష్ త్వరలో సుమంత్‌తో సినిమా ప్రారంభించనున్నట్లు తెలిపారు. గండికోట ప్రాంతం చాలా బాగుందని, ఇక్కడ షూటింగ్ చేస్తామని ఆయన తెలిపారు.

అరక్కోణం ప్యాసింజర్ రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైల్వే సాంకేతిక కారణాల వల్ల అరక్కోణం-కడప (06401), కడప-అర్కోణం (06402) మధ్య నడుస్తున్న ప్యాసింజర్ రైలును ఈనెల 22వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రద్దు చేశారని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

తిరుపతి-హుబ్లీ ప్యాసింజర్ కూడా..

తిరుపతి-హుబ్లీ-తిరుపతి(07657/07658) ప్యాసింజరు రైలు ఈనెల 22 నుంచి 30 తేదీ వరకు రద్దు చేసినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈనెల 23వ తేదీ నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు హుబ్లీ-తిరుపతి మధ్య రద్దు చేశారన్నారు. రైల్వే సాంకేతిక కారణాల వల్ల ఈ రైలును రద్దు చేశామని వివరించారు.

బెల్గాం వరకే కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్

కడప కోటిరెడ్డిసర్కిల్ : తిరుపతి-కొల్హాపూర్-తిరుపతి మధ్య నడిచే హరిప్రియ ఎక్స్‌ప్రెస్ (17415/16) ఐదు రోజులపాటు తిరుపతి-బెల్గాం మధ్య నడపనున్నారని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎ.జనార్దన్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని కుడచ్చి-ఉగర్ కుర్డ్ వద్ద నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తిరుపతి-కొల్హాపూర్ మధ్య నడిచే హరిప్రియ ఎక్స్‌ప్రెస్ ఈనెల 22 నుంచి 25వ తేది వరకు, కొల్హాపూర్-తిరుపతి మధ్య నడిచే హరిప్రియ ఎక్స్‌ప్రెస్ ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు బెల్గాం వరకే నడపనున్నారన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రబీ పైనే కోటి ఆశలు

- జిల్లాలో రబీ సాగుకు ప్రణాళిక సిద్ధం
- ఈ ఏడాది 1,52,600 హెక్టార్లలో సాగుకానున్న పంటలు
- మరో పది రోజుల్లో ముగియనున్న ఖరీఫ్ సీజన్



పంటలసాగుకు సన్నద్ధమవుతున్న రైతన్న

కడప అగ్రికల్చర్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సరిగా కురవని కారణంగా పంటల సాగు అంతంత మాత్రంగానే జరిగింది. జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించి 70 వేల హెకార్టలో సాగు కావాల్సి ఉండగా 44,020 హెక్టార్లలో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. 25980 హెక్టార్లలో పంటలు సాగు కాకుండానే ఖరీఫ్ సీజన్ ముగియనుంది. ఇక పోతే రైతుల ఆశలన్నీ రబీ సీజన్‌పైనే ఉన్నాయి. అక్టోబర్ మొదటివారం నుంచి రబీ సీజన్ ప్రారంభంకానుంది. దీంతోపాటు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అక్కడక్కడ ఆరుతడి పంటలను సాగు చేసేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు.


ఆశలన్నీ రబీ పైనే...

ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 1,52,600 హెక్టార్లలో సాధారణ పంటలసాగుకు వ్యవసాయ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇందు కోసం అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం ప్రతిపాదలను తయారు చేసి పంపారు. నాలుగైదు రోజుల్లో విత్తనాలు, పది రోజుల్లో ఎరువులు జిల్లాకు రానున్నాయి. జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి అన్ని పంటలకంటే అత్యధికంగా 97 వేల హెక్టార్లలో శనగపంట సాగయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇందుకు కోసం 74,120 క్వింటాళ్ల శనగలు అవసరమని ప్రణాళికను రూపొందించి పంపారు. దీంతోపాటు మరో 800 క్వింటాళ్ల వేరుశనగ, మినుములు, పెసలు కూడా అవసరమని తెలియజేశారు.నాలుగు రోజుల్లో విత్తనాలు రానున్నాయి. మరో వారం రోజుల్లో విత్తనాల కోసం ఆయా గ్రామాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) రిజిస్ట్రేషన్లను ప్రారంభించనున్నారు.

- రబీ సీజన్‌కు సంబంధించి 20 వేల మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇందులో 6 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, 9 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు(20:20, 28:28) మరో 5 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ప్రతిపాదలను పంపారు. జిల్లాకు ఎరువులు రాగానే ఆయా గ్రామాల పరిధిలో సాగును బట్టి ఎంతమేరకు అవసరమో ఆ మేరకు రైతు భరోసా కేంద్రాలకు తరలించనున్నారు.

రబీలో పంటల సాగు వివరాలు

పంట	సాధారణసాగు (హెక్టార్లలో)
వరి	12,000
జొన్న	9,000
సజ్జలు	3,000
మొక్కజొన్న	2,100
వేరుశనగ	9,000
పొద్దుతిరుగుడు	3,000
శనగపంట	97,000
మినుము	6,500
పెసలు	3,000
నువ్వులు	4,000
ఇతర పంటలు	4,000
మొత్తం	1,52,600



గతేడాది కంటే అధిక విస్తీర్ణంలో...

గత సంవత్సరం కంటే ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో శనగపంట సాగుకానుంది. గతేడాది రబీ సీజన్‌కు సంబంధించి 72 వేల హెక్టార్లలో శనగ సాగైంది. ఇందుకోసం అవసరమైన 40 వేల క్వింటాళ్ల తెప్పించారు. ఈ ఏడాది 97 వేల హెక్టార్లలో శనగ సాగు కాన్నుట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం 74,120 క్వింటాళ్ల శనగలు అవసరమని ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో పెద్దముడియం, వీఎన్‌పల్లె, సింహాద్రిపురం, మైలవరం, జమ్మలమడుగు, తొండూరు, వేంపల్లి, వేముల ప్రాంతాల్లో అత్యధికంగా శనగ సాగయ్యే అవకాశం ఉంది.

రైతులకు అండగా ఉంటాం



రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్నాం.వారం రోజుల్లో విత్తనాల కోసం ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్స్‌న ప్రారంభిస్తాం. జిల్లాలో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఈ పదును ఆరగానే రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకునే అవకాశం ఉంది. అన్నదాతకు అన్ని విధాలా అండగా ఉంటాం. – నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

80 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు



మాట్లాడుతున్న ఎస్.ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు, కేసీ కెనాల్‌కు నీరు విడుదల లేని కారణంగా ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల కింద రబీకి పెసలు, ఉలవలు, అలసందలు, మినుములు, జొన్న వంటి ఆరుతడి పంటలకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలను అందిస్తోందని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. విత్తనాలు కావాల్సిన రైతులు డి–క్రిషి విధానం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇప్పటికే పలు మండలాల్లో ఈ విధానం ద్వారా రైతులకు విత్తనాలు అందించినట్లు చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి 74,120 క్వింటాళ్ల శనగ విత్తనాలు జిల్లా మంజూరు చేశారన్నారు. ధరల నిర్ణయం అయిన వెంటనే రైతులకు అందిస్తామని చెప్పారు.

సైన్స్ సెమినార్‌లో వేంపల్లె విద్యార్థిని ప్రతిభ



హర్షిణికి షీల్డ్, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎంఈఓ వీరారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని పులివెందుల ప్రభుత్వ బాలికల హైస్కూల్లో గరువారం చిరుధాన్యాలు మంచి పౌష్టికాహారమా లేక ఆహార వ్యామోహమా అనే అంశంపై జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. దీనికి జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు, గైడ్ టీచర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము సిద్ధం చేసిన పోస్టర్లు, చార్ట్‌లు, పీపీటీలను ఇంగ్లీషు, తెలుగు బాషల్లో ప్రజంటేషన్ చేశారు. ఫుడ్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ నుంచి వచ్చిన ప్రొఫెసర్లు ఏడుకొండలు, జయమ్మ, పావనదీప్తిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు ప్రదర్శనలు పరిశీలించి ముగ్గురు విద్యార్థులను జిల్లా టాపర్స్ (విజేతలు) గా ప్రకటించారు. ఇందులో వేంపల్లె ఉషాకిరణ్ హైస్కూల్‌కు చెందిన హర్షిణి ప్రథమ స్థానంలో నిలిచింది.కడప చెమ్ముమియాపేట బాలికల హైస్కూల్‌కు చెందిన భ్రమరాంబిక ద్వితయ, నల్లపురెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన హసిని తృతయస్థానంలో నిలిచారు.హర్షిణి ఈ నెల 25న విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుంది.

వైభవం.. పవిత్రోత్సవం



గరుడవాహనంపై స్వామి, అమ్మవార్లు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటిలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాల్లో భాగంగా మూడోరోజు గురువారం శ్రీరంగనాథుడు గరుడ వాహనంపై సతీసమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చకులు కృష్ణ రాజేష్‌శర్మ ఉభయదారులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. నూలుపూజ పవిత్రోత్సవాలను 9రోజుల పాటు నిర్వహిస్తారు.భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ కేవీ రమణ, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్వచ్ఛ ఓటరు జాబితాకు సహకరించాలి

జిల్లా కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : స్వచ్ఛ ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులపై ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన దాదాపు పూర్తయిందన్నారు. మరణించిన, వలసలు వెళ్లిన, డబుల్ ఎంట్రీ ఓట్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించామన్నారు. తొలగించిన ఓట్లను బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల వారీగా పరిశీలించారని చెప్పారు. జంక్ ఓటర్లను పరిశీలిస్తున్నామని, ఇంకా ఎక్కడైనా ఒకే ఇంటి నెంబరులో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, టీడీపీ నాయకులు హరిప్రసాద్, బీఎస్పీ నాయకుడు దానం, బీజేపీ నాయకుడు లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్ నేత ప్రసాద్‌గౌడ్, ఆప్ నాయకుడు శ్రీనివాసులు, జేసీ గణేష్‌కుమార్, కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిలో ప్రగతి లక్ష్యాలను సాధించాలి

సుస్థిర అభివృద్ధి ప్రగతిలో వందశాతం లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, జగనన్న ఆరోగ్య సురక్ష, గ్రామవార్డు సచివాలయాల సేవలు, ఐసీడీఎస్ పథకాలు, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ఈ వీసికి కడప కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ విజయ రామరాజు, జేసీ గణేష్ కుమార్ లు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలోని 10–19 మధ్య వయసున్న ఆడపిల్లల్లో రక్తహీనతను నివారించడానికి అధికారులు బాధ్యతగా కృషి చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష లో డేటాను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, మలేరియా, డెంగ్యూ వ్యాధులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామ వార్డు సచివాలయ సేవలలో ఇచ్చిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలన్నారు.

బీటెక్ కోర్సుల్లో మార్పులు



మాట్లాడుతున్న వీసీ ఆచార్య రంగజనార్దన్

పులివెందుల రూరల్ : పులివెందుల జేఎన్టీయూ కళాశాలలో గురువారం ఇంటర్నెట్ ద్వారా బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగాహాజరైన అనంతపురం జేఎన్టీయూ వైస్ చాన్సలర్ రంగజనార్దన్ మాట్లాడుతూ ఆర్23 రెగ్యులేషన్స్ గురించి బీటెక్ కోర్సులో మార్పులు చేసేవిధంగా చర్చించినట్లు చెప్పారు. రెగ్యులేషన్స్‌లో మైనస్ డిగ్రీ, హానర్స్ డిగ్రీలను రెగ్యులర్ డిగ్రీతో పాటు ప్రవేశపెడుతున్నామన్నారు. ఈ సిలబస్‌లలో 5 ప్రొఫెషనల్ ఎలక్ట్రీవ్స్‌ను, 4 ఓపెన్ ఎలక్ట్రీవ్స్‌ను, 5 స్కిల్ ఓరియంటెడ్ కోర్సులను, క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ పాలసీని ప్రవేశపెడుతున్నామన్నారు. రెండు సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లను రెండో సంవత్సరం, మూడోసంవత్సరం చివరిలో చేయాలని.. వీటికి 8 వారాల వ్యవధిని ఇస్తున్నామన్నారు. 4వ సంవత్సరం రెండో సెమిస్టర్ ప్రాజెక్టు ఇంటర్‌షిప్‌ను సెమిస్టర్ మొత్తం ప్రవేశపెడుతున్నామన్నారు. వీటితో పాటు ఆడిట్ కోర్సులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రిన్సిపల్ వసుంధర, వైస్ ప్రిన్సిపల్ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప జట్టు విజయం



99 పరుగులు చేసిన విజయ్‌రామిరెడ్డి



6 వికెట్లు తీసిన ఎస్ఎండీ అయూబ్

కడప స్పోర్ట్స్: కడప నగరంలో నిర్వహించిన ఏసీఏ అండర్–19 అంతర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు 16 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 14 పాయింట్లతో విశాఖ రెండోస్థానంలో, 12 పాయింట్లతో కడప మూడోస్థానంలో నిలిచాయి. కాగా గురువారం కడపలోని కేఓఆర్ఎం మైదానంలో జరిగిన పోటీలో కడప, సెంట్రల్ జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. జట్టులోని విజయ్‌రామిరెడ్డి 99 పరుగులు చేశాడు. సెంట్రల్ జోన్ బౌలర్ యోచన్ శ్వేతక్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ 29 ఓవర్లలో 154 పరుగులకే ఆలౌటైంది. జట్టులోని అభినవ్ 48 పరుగులు చేశాడు. కడప బౌలర్ ఎస్ఎండీ అయూబ్ 6 వికెట్లు, ప్రణవ్ 2 వికెట్లు తీశారు. దీంతో కడప జట్టు 84 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

నార్త్‌జోన్ జట్టు విజయం..

వైఎస్ఆర్ఆర్–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నార్త్‌జోన్, సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ జట్టు 35.3 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌటైంది. దీంతో నార్త్‌జోన్ జట్టు 70 పరుగులతో విజయం సాధించింది. కాగా గుంటూరు, విశాఖపట్నం మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.

27న పర్యాటక దినోత్సవం ఫొటోగ్రఫీ పోటీలు

కడప కల్చరల్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఈనెల 27న నిర్వహిస్తున్న సందర్భంగా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా పర్యాటక ప్రాంతాల ఫొటోగ్రఫీ పోటీని జరుపుతున్నట్లు ఫొటో అండ్ వీడియోగ్రఫీ గౌరవ అధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డితెలిపారు. ఫొటోగ్రాఫర్లు జిల్లాలోని పర్యాటక ప్రాంతాల ఫొటోలను తీసి పోటీకి పంపాలని సూచించారు. సెప్టెంబరు 22లోగా ఒక్కొక్కరు రెండు ఫొటోలను 12 18 సైజులో అకాడమీ ఈ–మెయిల్ (పీఏఐవిజయవాడ అట్‌ది రేట్ ఆఫ్ జీమెయిల్.కామ్)కు పంపాలన్నారు. ఎంపికైన చిత్రాలను ఈనెల 27న విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ప్రదర్శిస్తామని తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తూ..

దైవ దర్శనానికి వెళ్తుండగా విషాదం చోటుచేసుకుంది. మార్గంమధ్యలో ఘోర ప్రమాదం జరిగింది. 30 మందితో వెళ్తున్న ట్రావెల్స్ బస్సును లారీ ఢీకొంది. ఆ ప్రాంతంలో రోదనలు, ఆర్తనాదాలు మిన్నంటాయి.

- ట్రావెల్స్ బస్సును ఢీకొన్న లారీ
- ఇద్దరు దుర్మరణం
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- పది మందికి గాయాలు



ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్సు



దెబ్బతిన్న లారీ ముందు భాగం



మృతి చెందిన బస్సు డ్రైవర్ వెంకటనారాయణ



లారీ డ్రైవర్ మృతదేహం



గాయపడ్డ మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



బాధితురాలికి సపర్యలు చేస్తున్న స్థానికులు

సంబేపల్లె : అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండల పరిధిలోని దేవపట్ల వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి 9:30 ప్రాంతంలో ట్రావెల్స్ బస్సును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. పది మందికి గాయాలు అయ్యాయి. సంఘటన జరిగిన తక్షణమే మూడు 108 వాహనాల ద్వారా బాధితులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. వివరాలు ఇలా వున్నాయి. వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు, జమ్ములమడుగు ప్రాంతాలకు చెందిన 30 మంది వీరాంజనేయ ట్రావెల్స్ బస్సు ద్వారా గురువారం తమిళనాడు, కేరళ ప్రాంతాలలోని ఆలయాలు, సందర్శన ప్రదేశాల పర్యటన నిమిత్తం బయలుదేరారు. గురువారం రాత్రి సంతోషాల మధ్య వారి ప్రయాణం సాగుతుండగా.. ఎదురుగా లారీ మృత్యు రూపంలో దూసుకొచ్చింది. చిత్తూరు వైపు నుంచి వస్తున్న లారీ దేవపట్ల సమీపంలోకి రాగానే ఈ బస్సును ఢీకొట్టింది. రెండు వాహనాల ఇంజిన్లు నుజ్జునుజ్జుగా నలిగిపోవడంతో.. ఇరువురు డ్రైవర్లు మృతి చెందారు. బస్సు డ్రైవర్ కె.వెంకటనారాయణ (37) కాగా, లారీ డ్రైవర్ తమిళనాడు ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడంతో వివరాలు తెలియరాలేదు. సమాచారం అందుకొన్న సంబేపల్లె పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. క్షతగాత్రులైన వారిని 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండు వాహనాలు ఇరుక్కుపోవడంతో జేసీబీ సాయంతో విడదీయాల్సి వచ్చింది. అప్పటికే డ్రైవర్లు మృతి చెందగా, ఇద్దరు సందర్శకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న వారిని స్థానిక వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. సంబేపల్లె పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ పరిశీలించారు. సంఘటనకు దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఆయన వెంట రూరల్ సీఐ తులసీరామ్ ఉన్నారు. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.

చివరి నిమిషంలో బస్సు డ్రైవర్ మారాడు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని ఎస్‌బీఆర్ టూర్‌కు సంబంధించిన ట్రావెల్స్‌కు తరచూ శ్రీకాంత్ డ్రైవర్‌గా వెళ్లేవాడు. అయితే చివరి నిమిషంలో పని ఉండటంతో శ్రీకాంత్ తనకు బదులుగా వెంకటనారాయణను పంపించాడు. సంబేపల్లె మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సు డ్రైవర్ వెంకటనారాయణను మృత్యువు కబళించింది. ప్రొద్దుటూరు మండలంలోని కానపల్లె గ్రామానికి చెందిన శ్రీకాంత్, కిశోర్‌లు టూరిస్ట్ కాంట్రాక్టర్లు మహమ్మద్ యాఖూబ్, షబ్బీర్‌లకు చెందిన ట్రావెల్స్‌కు డ్రైవర్‌గా వెళ్లేవారు. గురువారం రామేశ్వరం, కన్యాకుమారి యాత్రలకు వెళ్లేందుకు శ్రీకాంత్ అడ్వాన్స్ కూడా తీసుకున్నాడు. అయితే అతను సొంత పని మీద గుంటూరు వెళ్లాల్సి రావడంతో చివరి నిమిషంలో వెళ్లలేకపోయాడు. అతని స్థానంలో ప్రొద్దుటూరుకు చెందిన వెంకటనారాయణను పంపించాడు. దీంతో వెంకటనారాయణ, కిశోర్ అనే ఇద్దరు డ్రైవర్లు బయలుదేరి వెళ్లారు.

20వ తేదీనే వెళ్లాల్సి ఉండగా..

ఈ నెల 20న రామేశ్వరం, కన్యాకుమారి, శ్రీరంగం తదితర ప్రాంతాలకు ప్రొద్దుటూరు నుంచి టూరిస్ట్ ట్రావెల్స్ బయలుదేరాల్సి ఉంది. అయితే బుధవారం వినాయక నిమజ్జనం ఉండటంతో యాత్రికులందరూ గురువారం వెళ్దామని టూరిస్ట్ కాంట్రాక్టర్‌కు చెప్పారు. వారి కోరిక మేరకు గురువారం సాయంత్రం 5.15 గంటలకు బస్సు ప్రొద్దుటూరు నుంచి బయలుదేరింది. బస్సులో ప్రొద్దుటూరుతోపాటు జమ్మలమడుగు, మైదుకూరు, కడప ప్రాంతాలకు చెందిన 27 మంది మంది యాత్రికులు, ముగ్గురు వంట మనుషులు ఉన్నారు. 30 మందితో బయలుదేరిన బస్సు రోడ్డు ప్రమాదానికి గురైంది. విషయం తెలుసుకున్న యాత్రికుల కుటుంబ సభ్యులు టూరిస్ట్ కాంట్రాక్టర్‌కు ఫోన్‌లు చేసి తమ వారికి ఏమైందని తెలుసుకునే ప్రయత్నం చేశారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్లు సీజ్

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై తిరుపాల్‌నాయక్ తెలిపారు. కడప రోడ్డులోని హనుమాన్ జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. మూడు ట్రాక్టర్ల యజమానులు అనుమతి పత్రాలు చూపకపోవడంతో పట్టుకుని ఎస్ఈబీ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

వృద్ధుడి మృతిపై కేసు నమోదు


సుబ్బారెడ్డి మృతదేహం

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో వృద్ధుడు అట్ల సుబ్బారెడ్డి(60) మృతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్ బాబు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. ఈ నెల 17వ తేదీన రాత్రి ఇంటి నుంచి అతని షెడ్డు వద్ద పడుకోవడానికి సుబ్బారెడ్డి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. సుమారు ఏడాది నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్న ఆయన తరచూ బాధపడేవారు. గురువారం ఉదయం ఉప్పలూరు విద్యుత్తు ఉపకేంద్రం వద్ద కంపచెట్లలో విగతజీవిగా కనిపించారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో కుటుంబీకులు పోలీసులకు తెలిపారు. మృతికి కారణాలు తెలియరాలేదు. మృతుడి కుమారుడు మహేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డేంజర్‌లో మైనర్


హర్షవర్ధనాచారి

• అతివేగం.. తీసింది ప్రాణం

పాఠశాలకు చేరాలనే ఆతృతతో అతివేగంగా నడుపుతూ జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడ్డారు ఇద్దరు మైనర్లు. మండలంలోని బోడిగుట్ట, మెరంపల్లెకు చెందిన హర్షవర్ధనాచారి(07), నరేంద్రాచారి(15) పాఠశాలకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. గుర్రంకొండ సమీపంలో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించిబోయి అవగాహనా రాహిత్యంతో ఢీకొని ప్రాణాల మీదకు తెచ్చుకొన్నారు.


నరేంద్రాచారి

రోడ్డుపై బైక్‌లతో మైనర్లు దూసుకెళ్తున్నారు. ఒకరికి మించి మరొకరు పోటీ పడుతూ వేగం పెంచి రయ్ రయ్‌మంటూ నడివీధిలో హల్‌చల్ చేస్తున్నారు. నిండా పదేళ్లు కూడా లేని పిల్లలు ద్విచక్ర వాహనం నడుపుతున్నారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు ఏకంగా నలుగురు ఒకే స్కూటర్‌పై షికారు కొడుతూ విన్యాసాలు చేస్తున్నారు. గుర్రంకొండలో ఈ దృశ్యాలు నిత్యం కనిపిస్తుంటాయి.


స్కూటర్‌పై వెళుతున్న మైనర్ విద్యార్థులు

- పాఠశాలలకు ద్విచక్ర వాహనాలపై మైనర్లు
- సైలెన్సర్లు తీసేసి శబ్దం చేస్తూ విన్యాసాలు
- వేగంగా నడుపుతూ.. ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ
- మైనర్లకు వాహనాలు ఇవ్వద్దంటున్న పోలీసులు

గుర్రంకొండ : ద్విచక్ర వాహనాలను నడుపుతూ మైనర్లు తమ ప్రాణాల మీదకు తెచ్చుకొంటున్నారు. గుర్రంకొండ పట్టణ పరిధిలోని కడప–బెంగుళూరు జాతీయ రహదారిపై పెద్ద పెద్ద శబ్దాలు చేసే సైలెన్సర్లు పెట్టుకుని దూసుకెళ్తున్నారు. ఏమాత్రం రహదారి నిబంధనలు తెలియని వీరు.. ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇటీవల ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడడం ఇందుకు అద్దంపడుతోంది.


గుర్రంకొండ బస్టాండులో స్కూటర్‌పై నలుగురు చిన్నారులు

మైనర్ల హల్‌చల్

ద్విచక్రవా హనాలపై మైనర్లు దర్జాగా పాఠశాలలకు వెళ్తున్నారు. ఇవి పట్టణంలో నిత్యం కనిపించే దృశ్యాలే. పాఠశాల వదిలే సమయంలో తనతోటి ముగ్గురు, నలుగురిని ఎక్కించుకుని వేగంగా నడుపుతూ వెళ్లడంతో ఇతర విద్యార్థులు భయపడుతున్నారు. నిత్యం పాఠశాలకు వెళ్లేటపుడు, వచ్చే సమయంలోనూ మైనర్ల ఆగడాలు శృతిమించిపోతున్నాయి. పదేళ్ల నుంచి పన్నెండేళ్ల వయస్సున్న వారు ద్విచక్ర వాహనాలు నడుపుతున్నారు. ఇంత వేగంగా నడిపినపుడు ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటంటూ జనం ముక్కున వేలేసుకుంటున్నారు. చిన్న పిల్లలకు ద్విచక్ర వాహనాలిచ్చి రోడ్లపైకి పంపడంతో నడపడం చేతగాక ప్రమాదాలకు గురై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

సైలెన్సర్ తీసి.. నడుపుతూ

కొంతమంది ఆకతాయి మైనర్లు సైలెన్సర్లు తీసేసి పెద్ద శబ్దాలు చేస్తూ వాహనాలు నడుపుతూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. స్కూటర్ ముందు భాగం పైకి లేపి విన్యాసాలు చేస్తున్నారు. ఈ వ్యవహారం బెడిసి కొట్టి గుర్రంకొండ పట్టణంలో పది ప్రమాదాలు జరిగాయి. పలువురు మైనర్లు ఆస్పత్రులపాలయ్యారు. చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి కట్టడి చేయాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు.

తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం



మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. పట్టణంలో నాకాబందీ నిర్వహించి మైనర్ల ద్విచక్ర వాహనాలకు జరిమానా విధిస్తున్నాం. పలుచోట్ల రోడ్ స్టాపర్లను ఏర్పాటు చేశాం. విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించాం. పాఠశాల వేళల్లో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. పెద్ద శబ్దాలతో నడిపే వాహనాలను సీజ్ చేసి సైలెన్సర్లను ధ్వంసం చేయిస్తున్నాం. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు.
– దిలీప్‌కుమార్, ఎస్ఐ, గుర్రంకొండ

కిడ్నాప్ కేసులో

నలుగురు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం: పారిశుద్ధ్య కార్మికుడిని కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించిన కేసులో ఆదర్శ కాలనీకి చెందిన నలుగురిని టూటౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పొలిచెర్ల రాజశేఖర్ మున్సిపల్ శానిటరీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఆదర్శకాలనీలో బుధవారం సాయంత్రం వినాయక నిమజ్జనం సందర్భంగా కాకి చంద్రపై కొందరు వ్యక్తులు రంగులు చల్లారు. దీంతో అతను రాజశేఖర్ తమ్ముడు కుమారస్వామితో గొడవపడ్డాడు. అక్కడ మాటా మాటా పెరిగి వాగ్వాదం జరిగింది. కొంతసేపటి తర్వాత కాకి చంద్ర కొందరు వ్యక్తులను వెంట తీసుకెళ్లి వారిని బెదిరించాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం రాజశేఖర్ బాలాజీ నగర్‌లో పారిశుద్ధ్య పని చేస్తుండగా కాకిచంద్ర స్కార్పియో వాహనంలో వచ్చి అతన్ని తీసుకెళ్లాడు. కొర్రపాడు రోడ్డు లోని టీవీఆర్ పెట్రోల్ బంకు వద్దకు వెళ్లేసరికి రాజశేఖర్ అన్న వెంకటరమణ కనిపించగా అతన్ని కిడ్నాప్ చేసే ప్రయత్నం చేశారు. కూలీలు అడ్డుకోవడంతో రాజశేఖర్ కారులో నుంచి బయటికి వచ్చాడు. అతడి ఫిర్యాదు మేరకు కాకి చంద్రతోపాటు రామయ్య, బాలకుల్లాయప్ప, గురుప్రసాద్‌లను అరెస్ట్ చేసి రిమాండుకు పంపించినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య

మదనపల్లె : ఆర్థిక ఇబ్బందులతో ఒకరు వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి పట్టణంలో జరిగింది. అమ్మచెరువుమిట్ట రంగనాథ పెట్రోల్ బంక్ సమీపంలో సెలూన్ షాపు నిర్వహిస్తున్న పి.గంగాధర్(40) బుధవారం రాత్రి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి తర్వాత ఇంట్లోనే పంచెతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం చూసిన కుటుంబసభ్యులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై విచారించారు. బాధితుడికి ఇటీవల రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. భార్య మానస ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయ పనులకు వెళ్తుండగా ప్రమాదం

మహిళా కూలీ మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు


లక్ష్మీనరసమ్మ (ఫైల్)


క్షతగాత్రులను పరామర్శిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటోను కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. పట్టణం సమీపంలోని శివారు గ్రామాలకు చెందిన మహిళలు వ్యవసాయ పనులు చేసుకునేందుకు నిత్యం వెళ్తుంటారు. రోజూ మాదిరే గురువారం తెల్లవారుజామున రాజుపాలెంలోని రైతు పొలంలో కూలి పనులకు ఆటోలో బద్వేల్ నుంచి బయలుదేరారు. బయనపల్లె సమీపంలోకి చేరగానే.. కడప నుంచి బద్వేల్‌కు వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో పట్టణంలోని ఫాతిమా నగర్‌కు చెందిన బొడ్డు లక్ష్మీనరసమ్మ (56) అక్కడికక్కడే మృతిచెందారు. శివా నగర్‌కు చెందిన ప్రసన్న, రాజుపాలెం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఓబులేసులకు తీవ్రగాయాలయ్యాయి. వీరితోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న శివా నగర్‌కు చెందిన గంగమ్మ, రామలక్ష్మమ్మ, రమణమ్మ, అంజనమ్మ, ఫాతిమానగర్‌కు చెందిన కొండమ్మ, రాధాకృష్ణనగర్‌కు చెందిన చిన్నక్క, గౌరీశంకర్‌నగర్‌కు చెందిన వెంగమ్మ, ఆంజనేయనగర్‌కు చెందిన సుబ్బులక్ష్మమ్మలకు స్వల్పగాయాలయ్యాయి. మృతురాలి కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కారును స్టేషన్‌కు తరలించారు. గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం కడప ఆస్పత్రికి పంపారు.

మున్సిపల్ చైర్మన్ పరామర్శ

బద్వేల్ మండలం బయనపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళతోపాటు గాయాలపాలైన మహిళలంతా పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు కావడంతో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, గోపాలస్వామి ప్రభుత్వాసుపత్రికి వెళ్ళి పరామర్శించారు. గాయపడిన వారిని కడపకు తరలించేందుకు సొంత ఖర్చుతో అంబులెన్స్ ఏర్పాటుచేశారు. వెంకటక్రిష్ణ, తోటనాగేశ్వర్‌రావు, రెడ్డెయ్య, చెంచయ్య, మురళి పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

కమలాపురం : కమలాపురం పట్టణం వినాయక నగర్‌కు చెందిన వెంపటి నవీన్(26) ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నవీన్ బెంగుళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. వినాయక చవితి పండగకు ఇంటికి వచ్చాడు. గురువారం తల్లి, అన్న స్వగ్రామమైన వల్లూరుకు వెళ్లారు. ఈ సమయంలో నవీన్ ఫ్యాన్‌కు ప్లాస్టిక్ వైర్‌తో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు వచ్చి చూడగానే ఫ్యాన్‌కు వేలాడుతుండడంతో కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ చిన్నపెద్దయ్య మృతుడి నివాసానికి వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ప్రేమించిన అమ్మాయికి వేరే అబ్బాయితో వివాహం జరిగిందని నవీన్ ఆత్మహత్యకు పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ చిన్నపెద్దయ్య

ఎరువుల దుకాణాల తనిఖీ

గోపవరం : మండలంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ, ఏఓ అరవిందనాయక్ కలిసి సాయిక్రిష్ణ ట్రేడర్స్, టి.వి.మోహన్‌రాజు ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ–పాస్ మిషన్‌లో నమోదు కాని 150 బస్తాల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ప్రతి బస్తాపై రాయితీ ఆ కంపెనీలకు ఇస్తున్నందున ఆన్‌లైన్‌లో స్టాకు, దుకాణంలో నిల్వలకు మధ్య వ్యత్యాసం లేకుండా చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు అందజేయాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని సూచించారు. నిబంధనలు పాటించని దుకాణ యజమానులపై చర్యలు ఉంటాయన్నారు.

అట్లూరు : మండలంలోని అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద మహాలక్ష్మి ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరల పట్టిక, ఎరువుల బస్తాలు, తూకాలు, బిల్ పుస్తకాలు, స్టాకు రిజిస్టర్, ఈ–పాస్ మెషీన్ పనితీరు, అమ్మకాల వివరాలు, ధరల వివరాలు పరిశీలించారు. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయించితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యత కలిగిన ఎరువులు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలన్నారు. గడువు ముగిసిన సరకును రైతులకు విక్రయించరాదన్నారు.ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎరువుల దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న బద్వేలు ఏడీఏ నాగరాజ, ఏఓ అరవిందనాయక్

ఇరువర్గాల ఘర్షణ

• ఐదుగురికి గాయాలు • పోలీస్ పికెట్ కొనసాగింపు


గాయపడిన నరసింహులు

మదనపల్లె : వినాయకచవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటులో తలెత్తిన వివాదం పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఒకరినొకరు దాడి చేసుకోవడంతో పలువురికీ గాయాలయ్యాయి. ఎస్ఐ వెంకటేష్ వివరాల మేరకు.. మండలంలోని వేంపల్లె హరిజనవాడలో వినాయకుడి విగ్రహాల ఏర్పాటులో ఆధిపత్య పోరు నెలకొంది. పోలీసులు సంఘటనా స్థలంలో ఉండగానే ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులు వాగ్వాదం పెంచుకుని కర్రలతో దాడి చేసుకున్నారు. నరసింహులు వర్గంలోని నరసింహులు, నల్లప్ప, అర్జున్, మరో వర్గానికి చెందిన మంగళ, ఆమె భర్త రెడ్డప్ప గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరు వర్గాలకు చెందిన నరసింహులు, మంగళ పరస్పరం ఫిర్యాదు చేయడంతో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

సమర్థ నాయకత్వం..

విజయానికి సోపానం

కురబలకోట : సమర్థ నాయకత్వం... విజయానికి సోపానాలు అని శిక్షణ కార్యక్రమ రాష్ట్ర పరిశీలకురాలు కల్పన పేర్కొన్నారు. అంగళ్లులోని గోల్డన్ వ్యాలీ కళాశాలలో కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల ప్రాథమికోన్నత పాఠశాలల హెడ్మాస్టర్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. నాయకత్వ లక్షణాలపై జరుగుతున్న కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వ్యక్తి, వ్యవస్థ చివరకు దేశాలైనా.. నాయకత్వాన్ని బట్టే మనగలుగుతాయన్నారు. విజయవంతమైన నాయకుల్లో విలక్షణమైన లక్షణాలు ఉంటాయన్నారు. ఇలాంటివారిలో దార్శనికత, దూరదృష్టి, ప్రోత్సాహం, స్ఫూర్తి, ప్రేరణ, ప్రభావితం చేయగల నైపుణ్యత ఉంటుందన్నారు. హెడ్మాస్టర్లు నాయకత్వ లక్షణాలను ఒడిసి పట్టుకుని స్కూల్ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రజలను భాగస్వామ్యులుగా చేసినప్పుడే ఏపనిలోనైనా సత్ఫలితాలు రావడానికి ఆస్కారం ఉంటుందన్నారు. విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేయాలన్నారు. విద్యా వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్న తరుణంలో సమర్థ నాయకత్వంతో బడులను నిర్వహించాలన్నారు.

జర్నలిస్టులపై కేసులను ఎత్తివేయాలి

జిల్లా ఎస్పీకి ఏపీయూడబ్ల్యూజే వినతి


జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

కడప కార్పొరేషన్ : వేంపల్లిలో జర్నలిస్టులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి కోరారు. జర్నలిస్టులతో కలిసి వెళ్లి జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇసుక తరలిస్తున్న ప్రాంతంలో అనుమతులు లేవని రెవెన్యూ అధికారులు చెబుతున్నప్పటికీ జేపీ కన్‌స్ట్రక్షన్స్ వారు ఇసుక తరలిస్తున్నారన్నారు. ఫిర్యాదుదారుడు తన ఫిర్యాదులో మీడియా సంస్థలను పేర్కొనకపోయినప్పటికీ ఎస్ఐ తిరుపాల్ నాయక్ అత్యుత్సాహంతో కొన్ని పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారని చెప్పారు. ఎస్పీ స్పందిస్తూ జర్నలిస్టులపై పెట్టిన కేసుపై విచారణ చేయించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టు సంఘాల నాయకులు రామాంజనేయరెడ్డి, నారాయణ, శ్రీనాథ్‌రెడ్డి, నూర్ బాషా, శివకేశవరెడ్డి, సిద్ధయ్య, సుబ్బారెడ్డి,రాజు, రహీం, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా పనులు పూర్తిచేయండి

చెన్నూరు: చాలా చోట్ల జాతీయ రహదారి పనులు అసంపూర్తిగా ఉన్నాయని, పనులు పూర్తి చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వైఎస్ఆర్‌సీపీ నాయకులు నేషనల్ హైవే పీడీ నీరజ్ గుప్తా, ఆర్డీవో అధికారి మీరా ప్రసాద్ (ఆర్ఈపిఎల్) మదన్మోహన్, ఆర్టిఓ ధర్మచంద్రారెడ్డిలకు విన్నవించారు. కడప–కర్నూలు జాతీయ రహదారిని అధికారులు గురువారం పరిశీలించారు. ఆర్డీవో మీరా ప్రసాద్ మాట్లాడుతూ చెన్నూరులోని పెన్నా నది నుంచి గోసుల కళ్యాణ మండపం(ఆంధ్ర స్పైస్) హోటల్ వరకు రోడ్డు ప్రమాదాలు జరిగి 71 మంది మృత్యువాత పడినట్లు అధికారికంగా ధ్రువీకరించారన్నారు. చెన్నూరు వైఎస్ఆర్‌సీపీ నాయకులు చీర్ల సురేష్ యాదవ్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, పొట్టిపాటి రానా ప్రతాప్‌రెడ్డి, ప్రదీప్ రెడ్డి, సాదిక్ అలీ, వారిష్ , హస్రత్ తదితరులు రహదారి సమస్యలను అధికారులకు విన్నవించారు. చెన్నూరు కొత్త రోడ్డు నుంచి పెన్నా నది వరకు సర్వీస్ రోడ్లు, కాల్వ పనులు చేపట్టాలని, బస్ షెల్టర్ నిర్మించాలని కోరారు. అరుంధతీ నగర్, కొత్త గాంధీ నగర్, బెస్త కాలనీలో పనులు అసంతృప్తిగా మిగిలిపోయాయని, బెస్త కాలనీ వద్ద మట్టితో సైడ్‌వాల్ వేసినా, వర్షం వస్తే కారుతోందన్నారు. అధికారులు చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. వినతులను పరిశీలించిన అధికారులు కలెక్టర్‌తో సమావేశమై పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పఠాన్ అలీఖాన్, అన్వర్ భాష, అబ్దుల్ రబ్, జుమన్, వెంకట సుబ్బయ్య, ఎర్రసాని నిరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


చెన్నూరులోని హైవే పనులను పరిశీలిస్తున్న అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు